**Sakshi**

# 2011 గ్రూప్1 ముగిశాకే కొత్త నోటిఫికేషన్!

- ముందుగా గ్రూప్ 3, 2 పోస్టులకు పరీక్షలు
- గత నోటిఫికేషన్లలో మిగిలిపోయిన పోస్టుల సంఖ్యపై ఏపీపీఎస్సీ దృష్టి
- 2011 గ్రూప్1 మెయిన్స్‌కు త్వరలో రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే వ్యవహరిస్తున్నామంటున్న కమిషన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్ 3, గ్రూప్ 2 పోస్టులకు ముందుగా నోటిఫికేషన్లు జారీచేయాలని, ఆ తర్వాత గ్రూప్ 1 పోస్టులను భర్తీచేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) భావిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 2011 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సంబంధించి మళ్లీ మెయిన్స్ నిర్వహించాల్సి ఉన్నందున ఆ ప్రక్రియ ముగిసిన పిదపే కొత్తగా గ్రూప్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయాలని కమిషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏపీపీఎస్సీకి ప్రభుత్వం అనుమతిచ్చిన 4,009 పోస్టుల్లో గ్రూప్ 1 పోస్టులు 94 మాత్రమే ఉన్నాయి. తక్కిన పోస్టులన్నీ గ్రూప్ 2, 3 కేటగిరీలోనివే. 2011 గ్రూప్ 1 నోటిఫికేషన్లో పోస్టులు 312 కాగా అందులో ఏపీ కోటా కిందకు 173 వచ్చాయి. గ్రూప్ 1 పోస్టులపై కొత్త నోటిఫికేషన్ ఇవ్వడం కన్నా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాత నోటిఫికేషన్లలో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేస్తారు. అందులో ఏవైనా మిగిలిన వాటిని కలుపుకొని కొత్త నోటిఫికేషన్ జారీచేయనున్నారు. ఇదేవిధంగా ఏపీపీఎస్సీ ద్వారా 4,009 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ.. వీటితో పా టు గత నోటిఫికేషన్లలో భర్తీకాకుండా మిగిలి పోయిన పోస్టులను కూడా ప్రస్తుత నోటిఫికేషన్లలో చేర్చాలని కమిషన్ భావిస్తోంది.

**న్యాయవివాదాలకు ఆస్కారమివ్వకుండా 2011 గ్రూప్ 1**

సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2011 గ్రూప్ 1 పోస్టుల భర్తీని ఎలాంటి న్యాయవివాదాలకు ఆస్కారమివ్వకుండా భర్తీచేయాలని కమిషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇచ్చిన నోటిఫికేషన్‌లో పోస్టుల వివరాలు లేవంటూ అభ్యంతరాలు రావడంతో ఆ సమాచారాన్ని కూడా వెబ్‌సైట్లో పొందుపరుస్తున్నారు. ఇంతకు ముందు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆరు ప్రశ్నలను తొలగించి ఆపై మెయిన్స్‌కు అర్హులను గుర్తించారు. అందులో నుంచి గతంలో మెయిన్స్ రాయని వారిని తొలగించి కొత్త జాబితా ప్రకటించారు. ఆ జాబితాపై అభ్యంతరాలు రావడంతో మొత్తం అభ్యర్థులకు వచ్చిన మార్కులు, మెయిన్స్‌కు కొత్తగా ఎంపికైన వారి వివరాలను ప్రకటించారు. గతంలో మెయిన్స్ రాయని వారిని ముందుగా తొలగించి ఆపై 1:50 నిష్పత్తి ప్రకారం అర్హుల జాబితాను ఎంపికచేయాలని కొంతమంది డిమాండ్ చేస్తున్నా.. అది సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నమని ఏపీపీఎస్సీ స్పష్టంచేస్తోంది.

**ఆ పోస్టులు 2003 నోటిఫికేషన్లోనివే!**

2011 గ్రూప్ 1లోని 312 పోస్టుల నుంచి 36 పోస్టులను 2003 గ్రూప్1 మెరిట్ అభ్యర్థులకు ఎలా ఇస్తారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారమే చేస్తున్నామని ఏపీపీఎస్సీ పేర్కొంటోంది. 2011 నోటిఫికేషన్లో గ్రూప్ 1 పోస్టుల సంఖ్య కేవలం 276 మాత్రమేనని, మిగతా పోస్టులు అంతకుముందు నిర్వహించిన 2003 గ్రూప్ 1 నోటిఫికేషన్లలో భర్తీకాకుండా మిగిలిపోయినవని అధికారులు చెబుతున్నారు. 2003 గ్రూప్ 1 కేసులో క్యారీ ఫార్వర్డ్ విధానంలో భర్తీకాని పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చినందున 36 పోస్టులను 2003 మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాల్సి ఉంటుందంటున్నారు. ఆ 36 పోస్టుల్లో కూడా 15 నుంచి 20 వరకు మాత్రమే భర్తీ కావచ్చని, తక్కినవి 2011 గ్రూప్ 1 అభ్యర్థులతోనే భర్తీ అవుతాయని పేర్కొంటున్నారు.

**ఒక రాష్ట్రం పోస్టులకే అవకాశం**

ఇలా ఉండగా ఈ గ్రూప్1 మెయిన్స్ పరీక్షను ఏపీ, తెలంగాణలు ఒకే తేదీలో నిర్వహించేలా షెడ్యూళ్లు ఇవ్వడంతో గతంలో 312 పోస్టులకు ఉమ్మడి పరీక్షలు రాసిన అభ్యర్థులకు ప్రస్తుతం ఒక రాష్ట్రం పోస్టులకు మాత్రమే అవకాశం దక్కనుంది. రెండు రాష్ట్రాలు ముందుగానే చర్చించుకొని పరీక్షల షెడ్యూల్‌ను వేర్వేరు తేదీల్లో పెడితే న్యాయ వివాదానికి తావుండదని అభ్యర్థులు పేర్కొంటున్నారు.